అందరికీ అందుబాటులోకి ఆక్సిజన్ పార్కు



ఆక్సిజన్ పార్కును ప్రారంభించిన మంత్రి మల్లారెడ్డి



కేవీ రెడ్డి నగర్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో రూ. 40 లక్షలతో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ పార్కు అందరికీ అందుబాటులోకి వచ్చిందని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. టౌన్‌షిప్‌లో ఆక్సిజన్ పార్కును చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అధ్యక్షతన, కౌన్సిలర్ బెజ్జంకి హరిప్రసాదరావు ఆధ్వర్యంలో మంత్రి ఆదివారం ప్రారంభించారు. అనంతరం రూ. 30 లక్షల అంచనా వ్యయంతో షాపింగ్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. ప్రజల ఆశీస్సులతో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్, కౌన్సిలర్లు చింతల రాజశేఖర్, మెట్టు బాల్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు అక్రమ్ అలీ, దాసరి శంకర్, బీఆర్ఎస్ పోచారం మున్సిపల్ వర్కింగ్ ప్రసిడెంట్ గొంగళ్ల బాలేష్, నాయకులు బద్ధం జగన్మోహన్‌రెడ్డి, ఆకిటి బాల్‌రెడ్డి, కేఎం రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ మున్సిపాలిటీగా గుండ్లపోచంపల్లి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీని రాష్ట్రంలోనే నెంబర్-1 మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతానని అందుకు తాను పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని మంత్రి మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కేవీ రెడ్డి నగర్, కండ్లకోయ గ్రామాల్లోని పలు వార్డుల్లో రూ.4.45 కోట్లతో చేపట్టిన సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ, వైకుంఠధామం, వీధి దీపాలు తదితర అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మి శ్రీనివాస్‌రెడ్డితో కలిపి మంత్రి ఆదివారం ప్రారంభించారు. కండ్లకోయలో బస్తీ దవాఖానాను డీఎంహెచ్ఓ శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండ్లపోచంపల్లిని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ పాలకవర్గ సభ్యులు కృషి చేస్తున్నారని అందుకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాములు, వైస్ చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్లు వీణా సురేందర్, హంసరాణి, బాలరాజ్, పెంటయ్య, రజిత వెంకటేశ్, మున్సిపల్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు. మంత్రి మల్లారెడ్డి పర్యటన సందర్భంగా కండ్లకోయలో బీఆర్ఎస్ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను అర్ధరాత్రి కాంగ్రెస్ కార్యకర్తలు చించివేశారు. మంత్రికి స్వాగతం పలుకుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మున్సిపల్ వైస్ చైర్మన్ లు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను కాంగ్రెస్ శ్రేణులు చించివేశారని బీఆర్ఎస్ నాయకులు మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాలను పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

ఉప్పల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా నేనే బరిలో ఉంటా

ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి



హబ్సిగూడ: సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆశీస్సులతో ఉప్పల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తానే బరిలో ఉంటానని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశానని, నియోజకర్గంలోని ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించానన్నారు. కొందరు పార్టీని తప్పుదోవ పట్టించేందుకు ప్రకటనలు చేయించుకుంటున్నారని ఆరోపించారు. నెల రోజులుగా బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలలోకి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ఉద్యమం నాటి నుంచి సీఎం కేసీఆర్ వెంటే నడుస్తూ ఆయన ఆదేశానుసారం పని చేశానన్నారు. బీఆర్ఎస్ పార్టీ జెండా పట్టని కొందరు తాము అభ్యర్థులమంటూ ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. పార్టీ ఆదేశానుసారం పనిచేస్తూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి 'ఉన్నతి'పై ప్రధానోపాధ్యాయులకు శిక్షణ

జిల్లా విద్యాశాఖ అధికారి ఐ.విజయకుమారి



సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఈ నెల 21నుంచి 23 వరకు, అలాగే, 29 నుంచి సబ్జెక్టుల ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి తెలిపారు. ప్రభుత్వం ఉన్నత పాఠశాలల్లో ఆరు నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు అభ్యసనా అభివృద్ధి కోసం చేపట్టిన 'ఉన్నతి' కార్యక్రమం నిర్వహణపై ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కూకట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ శిక్షణ తరగతులు కొనసాగుతాయన్నారు. ప్రతిరోజు ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు ఉంటాయన్నారు. ఇప్పటికే జిల్లా నుంచి రిసోర్స్ పర్సన్‌లుగా శిక్షణ పొందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు శిక్షణ తరగతులను నిర్వహిస్తారన్నారు. ఈనెల 29 నుంచి సబ్జెక్టు ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులను జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని శిక్షణ కేంద్రాల్లో నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే ప్రాథమిక స్థాయిలో 'తొలిమెట్టు' కార్యక్రమం ద్వారా భాష సామర్థ్యాలు, గణిత సామర్థ్యాలపై ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో సామర్థ్యాల సాధనకు ప్రత్యేక కార్యక్రమం విజయవంతంగా అమలు చేస్తున్నట్లు విజయకుమారి తెలిపారు. ఉన్నత పాఠశాలలోని విద్యార్థుల్లో కూడా అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడం కోసం ప్రత్యేకంగా రూపొందించిన కార్యక్రమమే 'ఉన్నతి' అని ఆమె వివరించారు.

నేడు విద్యారంగ సమస్యలపై కలెక్టరేట్ ముట్టడి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సంతోష్



సాక్షి,మేడ్చల్ జిల్లా: విద్యారంగ సమస్యలతోపాటు పెండింగ్ స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు మేడ్చల్ జిల్లా ఎస్ఎఫ్ఐ కార్యదర్శి రాథోడ్ సంతోష్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో గురుకులాలు, మోడల్ స్కూళ్లలో సమస్యలు పేరుకుపోయాయన్నారు. మెస్ బిల్లులను విడుదల చేయాలని ,యూనివర్సిటీల్లో పెంచిన ఫీజులను తగ్గించాలన్నారు. విద్యాశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. విద్యాసంస్థల్లో మూడు రోజు పాటు ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ నిర్వహించిన అధ్యయన యాత్రలో అనేక సమస్యలను గుర్తించామన్నారు. పాఠశాలల్లో నాణ్యమైన మధ్యాహ్నం భోజనం అందడం లేదని, సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు సరిపడా కూరగాయలు, గుడ్లు, పండ్లు ఇవ్వడం లేదన్నారు. మన బస్తీ,మన ఊరు, మనబడి కింద విద్యాసంస్థల్లో చేపట్టిన అభివృద్ధి ,మరమ్మతు, నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సోమవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ చేపట్టిన చలో కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని విద్యార్థులను కోరారు.

క్లుప్తంగా...

నిత్యావసర సరుకుల పంపిణీ



ఉప్పల్: ఉప్పల్ కల్యాణపురి సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో ఆదివారం మేడపల్లిలోని ఆలన ఫౌండేషన్ అనాథాశ్రమానికి నిత్యావసర సరుకులు అందజేశారు. . ఆలన ఫౌండేషన్ విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలియడంతో సీనియర్ సిటిజన్స్ తమ వంతు బాధ్యతగా వారికి నిత్యావసర సరుకులను అందజేశారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్‌రామ్‌జీ, బీజేపీ నాయకులు

మౌలాలి: మల్కాజిగిరి నియోజకవర్గంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని మహారాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే అశోక్‌రామ్‌జీ అన్నారు. ఎమ్మెల్యే ప్రవాస్ యోజనలో భాగంగా ఆదివారం లాల్యానీ నగర్‌లో జరిగిన అసెంబ్లీ స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, బీజేవైఎం నేషనల్ ట్రెజరర్ సాయిప్రసాద్, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు భానుప్రకాష్, కార్పొరేటర్లు క్యానం రాజ్యలక్ష్మీ, శ్రావణ్, ఆర్‌కె.శ్రీనివాస్, సదానంద, ఓంప్రకాష్ పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ దేవాలయ వార్షికోత్సవం



వేడుకల్లో పాల్గొన్న బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: నాచారం శ్రీ పోచమ్మ దేవాలయ ప్రథమ వార్షి కోత్సవ వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నెమలికొండ భూపాల్‌రెడ్డి, దంతురి శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొ న్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరిస్తా



మల్లాపూర్: న్యూభవానీనగర్, గ్రీన్‌హిల్స్ కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మల్లాపూర్ వార్డు కార్యాలయంలో కాలనీవాసులు సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని కార్పొరేటర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరగా పనులు చేపడతామని హామీ ఇచ్చారు.

గంజాయి విక్రేత అరెస్టు

అల్వాల్: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అల్వాల్ పోలీసులు అరెస్టు చేసి అతని నుంచి కిలో గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ సురేష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అల్వాల్ సూర్యనగర్‌లో ఉంటున్న రుద్రకోట ప్రవీణ్ (23) నానక్‌రామ్‌గుడా నుండి గంజాయిని తీసుకొచ్చి అల్వాల్ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నాడు. దీనిపై సమాచారం అందడంతో అల్వాల్ పోలీసులు ఆదివారం అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అతడి నుంచి కిలో గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

చిన్నారిపై వీధి కుక్క దాడి



గాయపడిన చిన్నారి గాయత్రి

మల్లాపూర్: ఓ చిన్నారిపై వీధి కుక్క దాడి చేసిన సంఘటన బాబానగర్‌లో శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే మల్లాపూర్ బాబానగర్‌కు చెందిన చిన్నారి గాయత్రికి (02) శనివారం రాత్రి ఆమె తల్లి ఆరు బయట అన్నం తినిపిస్తుండగా ఓ వీధి కుక్క దాడి చేసింది. ఈ ఘటనలో చిన్నారి కాళ్లు, భుజంపై గాయాలయ్యాయి. ఈ ఘటనపై జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీ అధ్యక్షులు సూర్గం శివ ఆవేదన వ్యక్తం చేశారు.

అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలి

48 గంటల నిరసన దీక్ష విజయవంతం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్

రామంతాపూర్ : ఉప్పల్ నియోజకవర్గంలోని అర్హులైన నిరుపేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. ఆదివారం రామంతాపూర్ పబ్లిక్ స్కూల్ వద్ద ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ 48 గంటల నిరసన దీక్ష విజయవంతమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీక్షకు సంఘీభావం తెలిపిన ప్రజాస్వామ్యవాదులు, కుల సంఘాలు, బస్తీ సంఘాలు, బీజేపీ మోర్చా నాయకులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అర్హులైన నిరుపేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. నియోజకవర్గంతో సంబంధం లేని వారికి ఇళ్లు కేటాయిస్తే సహించమన్నారు. లేని పక్షంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని హెచ్చరించారు.

రెడ్ క్రాస్ సొసైటీ సేవలు అభినందనీయం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న సీనియర్ సిటిజన్స్

మల్లాపూర్: వయో వృద్ధులకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవలు అభినందనీయమని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ అన్నారు. ఆదివారం రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నాచారం ఓల్డ్ విలేజ్‌లో సీనియర్ సిటిజన్స్‌కు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంవీ ప్రేమ్ కుమార్, ప్రధాన కార్యదర్శి సాయిబాబా, కార్యదర్శి శ్రీశైలం, కార్యనిర్వాహక కార్యదర్శి ఎల్లేష్, యాదగిరి, రామకృష్ణ, జగన్నాథం, నాగేశ్వర్, సత్యనారయణ, పాండు రంగంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

మల్కాజిగిరి: దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు మంగమ్మ అన్నారు. జిల్లా అధ్యక్షుడు వినయ్ ఆధ్వర్యంలో ఆదివారం నేరేడ్‌మెట్‌లోని అంబేడ్కర్ భవన్‌లో మహిళా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్ పెంచినప్పటికీ ప్రస్తుత పరిస్థితుల్లో సరిపోవడం లేదన్నారు. అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయాలని, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల కేటాయింపులో ఐదు శాతం వాటా కల్పించాలన్నారు. కులాలకు అతీతంగా దివ్యాంగబంధు ఏర్పాటు చేసి ఆర్థిక చేయూత అందించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు కేశపాగ రాంచందర్ మాదిగ, జిల్లా అధ్యక్షురాలు శాంతాబాయి, రమేష్ తదితరులు పాల్గొన్నారు. మండల మహిళా కమిటీ అధ్యక్షురాలిగా బండారి లక్ష్మి, ఉపాధ్యక్షురాలుగా జ్యోతి,ప్రధాన కార్యదర్శిగా విజయలక్ష్మి, కార్యదర్శిగా శోభ, కోశాధికారిగా రేణుకను ఎన్నుకున్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

ఘట్‌కేసర్: వెంకటాపూర్‌లో వెంకటాపూర్ నీలిమా ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. సర్పంచ్ నిరుడి గీత శ్రీనివాస్‌ముదిరాజ్, ఉప సర్పంచ్ సత్యానారాయణగౌడ్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా 528 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నీలిమా మాట్లాడుతూ వైద్య శిబిరానికి హాజరైన వారు వైద్యం కోసం నీలిమా ఆస్పత్రిలో అడ్మిట్ అయితే బిల్లులో 50 శాతం రాయితీ ఇస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌ముదిరాజ్, శంకర్‌ముదిరాజ్, వేణుగోపాల్‌ముదిరాజ్, వైద్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం



వినాయక్‌నగర్ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న నందికంటి శ్రీధర్

అల్వాల్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని అందుకు 'కాలనీ నేస్తం- కాంగ్రెస్ హస్తం' కార్యక్రమానికి ప్రజల నుంచి వస్తున్న స్పందనే నిదర్శనమని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నందికంటి శ్రీధర్ అన్నారు. 'కాలనీ నేస్తం- కాంగ్రెస్ హస్తం' నినాదంతో ఆదివారం ఆయన వినాయక్‌నగర్ డివిజన్‌లోని దీన్‌దయాళ్‌నగర్, కాకతీయనగర్ తదితర ప్రాంతాల్లో ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నందికంటి శ్రీధర్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుందన్నారు. ఆరోగ్య శ్రీ పరిమితి రూ. 5 లక్షలకు పెంచుతామన్నారు. పేదలకు గృహ నిర్మాణం కోసం రూ. 5 లక్షల ఆర్థిక సహాయం, గ్యాస్ సిలిండర్ రూ. 500కే ఇస్తామన్నారు. యువతులకు ఎలక్ట్రికల్ స్కూటర్లు, రూ. 4 వేల నిరుద్యోగ భృతి, వృద్ధులకు రూ. 4 వేల పెన్షన్ ఇస్తామన్నారు.

కమనీయం.. గోదా కల్యాణం

ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లో శ్రీ గోదాసమేత మన్నార్ రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం గోదా దేవి కల్యాణం కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. మంత్రి సతీమణి, కుమారుడు భద్రారెడ్డి, కోడలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పురుషోత్తమాచార్యులు, లక్ష్మణాచార్యులు, మల్కాజిగిరి ఏసీపీ నరేష్‌రెడ్డి, సర్పంచ్ కాలేరు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలపై కార్పొరేటర్ సమీక్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ బన్నాల గీత

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ పరిధిలోని శ్రీనగర్ కాలనీలో నెలకొన్న సమస్యలపై ఆదివారం కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్‌ముదిరాజ్ స్థానికులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు రామి రెడ్డి, సభ్యులతో సమస్యలపై చర్చించారు. కాలనీల్లో సీసీ రోడ్లు, బాక్స్ కల్వర్టులు, సీవరేజ్ లైన్లు, మంచి నీటి పైపులైన్లు వేయాలని కాలనీవాసులు కోరారు. ఓపెన్ స్పేస్‌లో షెడ్ నిర్మించి ఇవ్వాలని కోరారు. దీనికి కార్పొరేటర్ సానుకూలంగా స్పందించారు. సాధ్యమైనంత త్వరలో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీకాంత్, బీఆర్ఎస్ నాయకులు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. తరంగిణి శిష్య బృందం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. మూషిక వాహన, మీనాక్షి పంచరత్న, భావములోన, ముద్దుగారే యశోధ, అష్టలక్ష్మీ స్తోత్రం, తదితర అంశాలను దాదాపుగా 40 మంది కళాకారులు వేదికపై ప్రదర్శించి అలరించారు.

గద్దర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



జవహర్‌నగర్: ప్రజా యుద్ధ నౌక, ప్రజా గాయకుడు గద్దర్ ఆశయ సాధనకు కృషి చేయాలని న్యూ అంబేడ్కర్‌నగర్ కాలనీవాసులు అన్నారు. ఆదివారం న్యూ అంబేడ్కర్ నగర్‌లో కాలనీవాసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గద్దర్ సంస్మరణ సభలో ఆయనకు ఘనం నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కవి, గాయకులు కానుగంటి కలం వెంకటేష్ కళాబృందం ఆట, పాటలతో ఉత్తేజపరిచారు. కార్యక్రమంలో కాలనీవాసులు, కవులు, కళాకారులు, పాల్గొన్నారు.

ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు



హబ్సిగూడలో రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రాగిడి లక్ష్మారెడ్డి



మిర్జాల్‌గూడలో..



అల్వాల్‌లో..



పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

అల్వాల్/గౌతంనగర్: దేశంలో ఐటీ రంగానికి పునాదులు వేసిన ఘనత దివంగత ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్‌గాంధీకి దక్కుతుందని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నందికంటి శ్రీధర్ అన్నారు. ఆదివారం గౌతంనగర్ డివిజన్, మిర్జాల్‌గూడలోని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జీడి. శ్రీనివాస్‌గౌడ్, లింగారెడ్డి, ప్రవీణ్‌కుమార్, గుత్తి రాంచందర్, గౌస్, మహ్మద్ ఆలీ, ఎమ్మార్ శ్రీనివాస్ యాదవ్, రెబ్బ వాసు, యాదగిరి, నరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్‌లో.....

అల్వాల్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షులు శ్రీనివాసులు, సూర్యప్రకాష్‌రెడ్డి, పవన్‌కుమార్, సంతోష్‌రెడ్డి, శివశంకర్, సంజీవరెడ్డి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

మిర్జాల్‌గూడలో...

మిర్జాల్‌గూడ చౌరస్తాలో స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ నేత బోనగిరి సురేష్‌యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు విజయ్, యాదిగిరి, వెంకటేష్, తిరుపతి, నర్సింహ్మారావు, క్రిష్ణ, రమేష్, నరేందర్ తదితరులు ఉన్నారు.

ఐటీ ప్రదాత రాజీవ్‌గాంధీ...

హబ్సిగూడ: ఐటీ రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఘనత స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి దక్కుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా ఆదివారం హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ వద్ద ఆయన విగ్రహానికి రాగిడి లక్ష్మారెడ్డి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వినోద్ ముదిరాజ్, మహ్మద్ రఫీక్, కాలేరు జైనవీన్ పాల్గొన్నారు.

రామంతాపూర్‌లో..

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆదివారం రామంతాపూర్ ప్రధాన రహదారిలో రాజీవ్ విగ్రహానికి ఉప్పల్ నియోజకవర్గ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.